## కథ




'నిర్మలతో నీకు ఎఫైయిర్ ఉందా?'

అకస్మాత్తుగా చక్రధర్ నుంచి వచ్చిన ప్రశ్నకు ఆశ్చర్యపోయాను. అలాంటిదేమీ లేదన్నాను. అయినా నీకా అనుమానం ఎందుకొచ్చిందని అడిగాను.

'దీంట్లో అనుమానమేముంది కిరణ్, నువ్వు ఆమెకు బెస్ట్‌ఫ్రెండ్‌వని అందరికీ తెలుసు. అలాంటప్పుడు ఎఫైయిర్ ఉండటంలో మాత్రం తప్పేముంది? ఉందనే మన సర్కిల్‌లో చాలామంది అనుకుంటున్నారు. అందుకనే అడిగాను' అన్నాడు.

'సారీ, నాకు ఆమెతో స్నేహమే తప్ప ఎలాంటి సంబంధం లేదు. మా ఇద్దరికీ మంచి స్నేహం ఉంది. నిర్మల నాతో చాలా సన్నిహితంగా ఉంటుంది. అయితే అది శారీరక సాన్నిహిత్యంగా ఎవరయినా పొరపడితే నేనేం చేయలేను'

'పోనీ నిర్మలకి అలా దగ్గర కావాలనిపించలేదా నీకు ఎప్పుడూ'

'ఈ శల్యపరీక్ష ఏమిటోయ్ బాబు?' నవ్వుతూ అన్నాను.

'అది కాదు కిరణ్, నన్ను వేరే రకంగా అనుకోవద్దు. కొన్ని విషయాలు ఫ్రాంక్‌గా మాట్లాడుకోవటం బావుంటుందని అడుగుతున్నాను. ఈ మాత్రం పర్సనల్ విషయాలు మాట్లాడుకునే స్నేహం మన మధ్య లేదనుకోవటం లేదు' అతడు అలా అపాలజిటిక్‌గా అడగటం నాకే వింతగా తోచింది.

'ఒకే ఫ్రెండ్, నాకేం రహస్యాల్లేవు. నిర్మల మా ఆవిడ లేనప్పుడు కూడా మా ఇంట్లో ఉన్న రోజులున్నాయి. అయితే ఆమె నాకు సురేష్ ద్వారానే పరిచయం. సురేష్, నిర్మల ప్రేమించుకున్నారు. వాళ్ళ పెళ్ళికి ఇరువైపుల ఎవరూ ఒప్పుకోలేదు. కాని నేను అన్ని రకాలుగా సపోర్టు ఇచ్చాను. ఒకరకంగా వాళ్ళ పెళ్ళి పెద్దను నేను. సురేష్ కూడా నాకు ఎప్పట్నించో ఫ్రెండ్. ఈ విషయాలు మన వాళ్ళకు ఎవరికీ తెలియవనుకోను. అయినా ఇవాళ నిర్మలకి నాకు ఏదో ఉందనడం అన్యాయంగా లేదూ' అన్నాను.

'నువ్వు చెప్పేది నిజమే గాని, ఇప్పుడు పరిస్థితి వేరు. సురేష్ నిర్మల గొడవ పడుతున్నారని అందరికీ తెలుసు. అదే టైంలో నిర్మల ఎవరి దగ్గరయినా ఓదార్పు పొందగలుగుతుందంటే అది నీ దగ్గరే. ఈ టైంలో అనుకోకుండా మీ-ఇద్దరి మధ్య ఆ రకమైన ఫిజికల్ రిలేషన్ ఏర్పడకూడదని ఎక్కడుంది? అదే నా అనుమానం. ఈ అనుమానం నాకు రావచ్చు, మరెవరికయినా రావచ్చు. అందులో తప్పేముంది? నేనయితే నిర్మలకు నీతో ఎఫైయిర్ ఉండటమే మేలంటాను'

'నువ్వు మరీ ఎక్స్‌ట్రీమ్‌కు వెళుతున్నావోయ్, ఇక టాపిక్ మారుద్దాం' అన్నాను లోలోపల వస్తున్న కోపాన్ని అణచుకుంటూ.

'బీ ఫ్రాంక్ మైడియర్ ఫ్రెండ్. పోనీ ఒక విషయం అడుగుతాను చెప్పు. నిర్మల పట్ల నువ్వెప్పుడూ ఉద్వేగం చెందలేదా?' ఆ ప్రశ్నతో ఆలోచనలో పడ్డాను.

'మన మాటలు ఇక్కణ్ణించి ఎక్కడికి పోవు. కాని మనల్ని మనం ఎవరో ఒకరి ముందు వ్యక్తపరచుకోవడం బావుంటుంది కదూ' అన్నాడు మళ్ళీ తనే.

కాస్సేపయ్యాక చెప్పాను.

'నాకు బాగా గుర్తు. ఒకే ఒక్కసారి నిర్మల పట్ల నేను ఉద్వేగం చెందాను. అదీ ఆమెతో పరిచయం స్నేహంగా మారుతున్న కాలంలో. కాని ఆ టైంలోనూ గిల్టీగా ఫీలయ్యాను. ఎందుకంటే నిర్మల సురేష్‌ను ప్రేమిస్తుందని అప్పటికే తెలుసు కాబట్టి. బహుశా అదే ఆఖరుసారి. ఈ విషయం కూడా నువ్వు అడిగావు కాబట్టి గుర్తు చేసుకుని చెబుతున్నాను'

'సెన్సిటివ్ విషయాలే కావచ్చు గానీ, మన సంభాషణల్లో వీటిని ఎడిట్ చేసుకోవాల్సిన అవసరమేముంది? ఏమంటావు?' అన్నాడు చక్రధర్.

'నేను దీనికేం ఫీల్ కావడం లేదు గాని, ఇప్పటికయినా నేను చెప్పింది నువ్వు నమ్మితే చాలు'

'నువ్వు ఈ మాట అనడం ఏం బాగోలేదు. నన్ను అడక్కుండానే నేను నమ్ముతాననే నువ్వు గ్రహించకపోతే ఎలా?'

'ఓకే యార్ ఇట్సాల్ రైట్'

★ ★ ★

వెన్నెల రాత్రి ఆహ్లాదంగా ఉంది. రమణ, నేనూ కలిసి మందు తాగడం అరుదు. ఆ రోజు రమణ ఫోన్ చేస్తే డ్యూటీ అయిపోగానే వాళ్ల ఇంటికెళ్ళాను. ఒక్కడే ఉన్నాడు. మందు సీసాలతో ఇద్దరం డాబా మీద కూర్చున్నాం. ఏ విషయమైనా నాతో షేర్ చేసుకోకుండా ఉండలేని స్వభావం రమణది.

ఇద్దరం కబుర్లలో పడ్డాం. కాస్సేపయ్యాక

'ఒక విషయం అడుగుతాను ఏమనుకోవు కదా' అన్నాడు రమణ.

'అదేంటోయ్, ఈ మొహమాటాలేమిటి? నీ దగ్గర దాచాల్సిన విషయాలేముంటాయి నాకు' అన్నాను అతను అడిగిన తీరుకు ఆశ్చర్యపోతూ.

కాస్సేపు మౌనంగా ఉన్నాడు.

'నువ్వేంటో నాకు తెలుసు. కాని నలుగురూ అనుకుంటూ ఉంటే నిజమేంటో తెలుసుకోవాలని అడుగుతున్నాను అంతే. నీ జవాబు ఏదైనా రిసీవ్ చేసుకుంటాను...' అంటూ సిగరెట్ ముట్టించడానికి ఆగి నా వైపు చూశాడు.

'ఇంతకీ అసలు విషయమేంటో చెప్పు' అన్నాను - తను అడగదలచుకున్నదేమిటో త్వరగా తెలుసుకోవాలన్న ఆత్రుతతో.

సిగరెట్ ముట్టించి గాలిలోకి పొగ వదులుతూ 'నీకు నిర్మలతో ఫిజికల్ రిలేషన్స్ ఏమైనా ఉన్నాయా?' అన్నాడు.

ఆశ్చర్యంతో రమణ వంక చూశాను.

'ఈ మాట ఎవరన్నారు?' అని అడిగాను.

'ఎవరయితేనేం. ఎవరో అంటేనే అడుగుతున్నాను. నాకు కావాల్సింది నీ జవాబేగాని ప్రశ్నలు కాదు'

కొన్ని క్షణాల మౌనం తర్వాత చెప్పాను.

'మనుషులకు ఈ అనుమానాలు ఎందుకు వస్తాయో అర్థం కాదు. నాకు నిర్మలతో స్నేహం తప్ప మరే సంబంధం లేదు. అది నా ఊహకు అందని విషయం. అసలు అట్లా ఊహించడం ఎలా సాధ్యమో నాకు అర్థం కాదు'

'నాకు తెలుసు కిరణ్. ఇది చాలా సెన్సిటివ్ విషయం. నిన్ను అనుమానించిన వాళ్ళ గురించి ఇప్పుడు చెప్పను గాని, వాళ్ళ మాటలు విన్నప్పుడు నేనే ఆశ్చర్యపోయాను'

'నిర్మలతో నా సాన్నిహిత్యం ఒక్కోసారి సురేష్‌కే అసూయ కలిగిస్తుందని తెలుసు. ఎంతయినా భర్త కదా, అది మామూలే. ఏదైనా విషయం వస్తే భర్త కదా అని నిర్మల అతడిపట్ల ఉదారంగా ఉండదు. నా వాదన కరెక్టయితే నన్నే గట్టిగా సమర్థిస్తుంది. సురేష్‌ను చివాట్లు పెడుతుంది. ఆ ఫ్రాంక్‌నెస్ అరుదు. బహుశా అందుకేనేమో నిర్మలతో సాన్నిహిత్యం పెరిగింది. కాని ఈ సాన్నిహిత్యానికి ఇలాంటి అర్థాలు తీస్తారని ఎప్పుడూ అనుకోలేదు' బాధతో అన్నాను.

'నువ్వు కొన్ని విషయాల్లో ఇన్నోసెంట్‌వి కిరణ్. కొందరు ఇంకా అనేక అర్థాలు తీస్తారు. ఇలా అంటారని కూడా నీకు తెలియడం కోసమే అడిగాను. ప్లీజ్ టేకిట్ ఈజీ. ఈ విషయం గురించి మరీ ఎక్కువగా ఆలోచించకు' అన్నాడు అనునయంగా రమణ.

'ఆ మాటకొస్తే ఎవరో ఏదో అంటారని, అనుకుంటారని తెలియంది కాదు. కాని వాళ్ళు నీకు నాకూ ఎంతో కొంత సన్నిహితులయి ఉండటమే విషాదం' అన్నాను.

'కావచ్చు. కాని మన దగ్గర ఉన్నవాళ్ళంతా ఒకే తీరుగా ఆలోచిస్తారన్న గ్యారంటీ ఏం లేదు. ఇక ఈ విషయాన్ని వదిలేద్దాం' అంటూ గ్లాసు చేతిలోకి తీసుకున్నాడు రమణ.

నేను ఆకాశంవైపు చూపులు సారించాను. చంద్రుడు మబ్బుల చాటు నుంచి అప్పుడే పైకి వచ్చాడు.

★ ★ ★

ఊరి నుంచి రావడంతో బాగా అలసిపోయాను. స్నానంచేసి వచ్చి అప్పుడే కూర్చున్నాను రిలాక్సింగ్‌గా.

అరుణ కాఫీ తెచ్చి ఇచ్చింది.

కాఫీ తీసుకుంటూ 'ఏమిటి సంగతులు?' అని అడిగాను.

'ఏముంటాయి. ఒక్కరోజు మీరు సిటీలో లేనంత మాత్రాన ఉపద్రవాలు ముంచుకొస్తాయనుకున్నారా?' అంది నవ్వుతూ.

'దేనికీ సూటిగా జవాబు చెప్పవు కదా'

'మీరు అడిగిందాంట్లో అర్థమేంటో మరి'

'నీతో మాట్లాడటం కష్టమే గాని... నాకు ఏమైనా ఉత్తరాలు వచ్చాయా? ఎవరైనా వచ్చారా?' అడిగాను.

'ఉత్తరాలేం రాలేదు. నిన్న సాయంత్రం నిర్మల వచ్చింది'

'ఈ మధ్య తను అసలు రావటమే లేదు. ఏంటట విశేషాలు?' అంటూ ఆసక్తిగా అడిగాను.

'విశేషాలు నాకెందుకు చెబుతుంది. ఏమైనా ఉంటేనే మీతోనే చెప్పుకుంటుందామె. మీరు లేరనగానే అయిదు నిముషాల్లోనే వెళ్ళిపోయింది. ఇక్కడ మీరు తప్ప మేం మనుషులం కాదేమో మాట్లాడటానికి' ఆ గొంతులో నిష్టూరం, వెటకారం మిళితమై ఉన్నాయి.

'ఎందుకలా ఊరికే మాట్లాడతావు. తను ఏదో పనుండి వెళ్ళిపోయిందేమో, నీకు తెలుసా?' అన్నాను.

'మీకు ఇష్టమైన వాళ్ళను ఏ రకంగానైనా వెనకేసుకు వస్తారు లెండి' మళ్ళీ అదే నిష్టూరం, అదే వ్యంగ్యం. నిర్మల ప్రస్తావన వస్తే ఆమె ఇరిటేట్ అవుతుంది. అందుకే ఏం అనలేక అలా చూస్తుండిపోయాను.

'ఎందుకలా చూస్తారు? ఉన్న మాటంటే ఉలుకు ఎక్కువట. ఇక్కడ నేనొకదాన్ని ఉన్నానన్న విషయమే మరిచి మీ గదిలో దూరి గంటల తరబడి మాట్లాడటం, బయట ఎక్కడయినా కలిస్తే మిమ్మల్ని పక్కకు పిలిచి మాట్లాడటం, మిమ్మల్ని ఒక్కళ్ళనే ఇంటికి రమ్మని పిలవటం... ఇవన్నీ ఎవరికి తెలియవు గనుక. పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగుతూ తనను ఎవరూ చూడట్లేదనుకుంటుందట. మీ వ్యవహారం కూడా అలానే ఉంది' తన లోపల ఎప్పట్నించి ఉందో ఆ ఆక్రోశమంతా ఆ రోజు బయటపడింది.

ఆమె మాటలకు అవాక్కయ్యాను. నిర్మల అంటే నచ్చదని తెలుసు. కాని ఇంతలా మనసులో పెట్టుకుంటుందనుకోలేదు.

అయినా అర్థంలేని ఆమె మాటలు కోపం తెప్పించడంతో 'అయితే ఏమంటావ్?' అన్నాను విసుగ్గా.

'మీ వ్యవహారం ఎన్నాళ్ళో సాగదంటాను. ఎప్పుడో ఒకసారి మీ బండారం బయటపడకపోదు' అంది ఉక్రోషంగా.

'అర్థం లేకుండా మాట్లాడకు. నిర్మల గురించి నీకు ఇంతకు ముందే చెప్పాను. మా స్నేహాన్ని అర్థం చేసుకునే సంస్కారం లేకపోతే నేనేం చేయలేను' అన్నాను.

'మాటలకేం ఎన్నయినా చెబుతారు. మిమ్మల్ని ఎవడు నమ్ముతాడు' అంటూ విసురుగా లోపలికి వెళ్ళిపోయింది.

'అసలు ఎవరినైనా నమ్మించాల్సిన అవసరం నాకేమిటి?' అనుకున్నాను. కాని మనుషుల్ని అర్థం చేసుకోవటానికి ఎవరూ ప్రయత్నించలేం అనిపించింది.

★ ★ ★

ఆదివారం మధ్యాహ్నం అబిడ్స్‌లో మంచి పుస్తకాలు ఏమైనా కనిపిస్తాయేమోనని ఫుట్‌పాత్ మీద పాత పుస్తకాల కోసం వెళ్ళాను. ఒకచోట పాత 'సెమినార్లు' కనిపిస్తే తిరగేస్తూ నిలుచున్నాను.

'హలో కిరణ్' అంటూ కాస్త దూరం నుంచి వినిపించడంతో అటువైపు చూశాను. నిర్మల ఒక చేతిలో నాలుగైదు పుస్తకాలతో-

'హలో' అంటూ దగ్గరగా వెళ్ళాను.

'సురేష్ వచ్చాడా? ఎక్కడ?' అని అడిగాను.

'సురేష్ ఊరు వెళ్ళాడు. నీతో కలిసి వద్దామని మీ ఇంటికెళ్ళాను. పొద్దున్నే వెళ్లావని అరుణ చెప్పింది... ఏంటసలు కనిపించడం మానేశావు?'

'ఇప్పుడు కనిపిస్తున్నాను కదా' అన్నాను నవ్వుతూ.

'ఇప్పుడు కనిపిస్తే సరా, ఇన్ని రోజులు ఏమయ్యావు?'

'సరేగాని, అలా వెళ్ళి టీ తాగుతూ మాట్లాడుకుందాం పద' అన్నాను.

ఇద్దరం తాజ్ వైపు నడిచాం.

లోపలికెళ్ళి కూర్చున్నాక నిర్మల మళ్ళీ మొదలుపెట్టింది.

'నువ్వు కనిపించక రెండు వారాలయింది. ఇన్ని రోజులు కలవకుండా ఎప్పుడయినా ఉన్నామా? నీ కోసం ఆఫీసుకు ఫోను చేస్తే ఎప్పుడూ సీట్లో లేవని చెబుతుంటారు. అసలేమైంది నీకు? నా మీద ఏమైనా కోపం వచ్చిందా ఏమిటి? ఇలా తన ధోరణిలో మాట్లాడుతూ పోయింది.

కాని ఏం చెప్పాలో తోచలేదు నాకు. పదిహేనురోజుల కిందట చక్రధర్, రమణ, అరుణ మాట్లాడిన మాటలు ఇంకా వెంటాడుతున్నాయి. వాళ్ళ ముగ్గురి మాటలు విన్నాక కొన్నాళ్ళు నిర్మలను కలవకుండా ఉంటే ఏం అనుకున్నాను. చాలాసార్లు తన ఇంటికి వెళ్ళాలనిపించినా నన్ను నేను ఆపుకున్నాను. ఈ పదిహేనురోజులుగా నేను తనను కలవడం లేదన్న బాధ నాకూ ఉందని తనకు ఎలా తెలుస్తుంది.

(మిగతా 14వ పేజీలో...)

